




# కరపత్రం

SINCE 2014

గురువారం ఫిబ్రవరి 13 2025 | సంపుటి :0 | సంచిక : 122 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4


## సేవాలాల్ జయంతి ఉత్సవాలకు సిఎంకు ఆహ్వానం

ఈ నెల 15 న మహావీర్ సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహించనున్నారు. ఏటా ప్రభుత్వం అధికారికంగా దీనిని నిర్వహిస్తోంది. ఉత్సవాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మంత్రి సీతక్క, గిరిజన సంఘాల ముఖ్య నాయకులు కలిశారు. ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా ఆహ్వానం అందించారు. ఈ మేరకు సిఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.



## అమెరికాలో నక్కిన గ్యాంగ్‌స్టర్లు.. జాబితా సిద్ధం చేసిన భారత్..!

**భారత్‌లోని భద్రతా ఏజెన్సీలు పలువురు గ్యాంగ్‌స్టర్ల పేర్లతో ఓ నివేదిక రూపొందించినట్లు సమాచారం.**

**దానిని అమెరికాకు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.**



ప్రధాని మోదీ అమెరికా పర్యటన వేళ భారత్ కీలక నిర్ణయం తీసుకోనుందని తెలుస్తోంది. అమెరికాలో నక్కి.. భారత్‌లో చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్న గ్యాంగ్‌స్టర్లను తిరిగి వెనక్కి రప్పించే ప్రయత్నాలను వేగవంతం చేయనుంది. దీనిలో భాగంగా సిద్ధం చేసిన గ్యాంగ్‌స్టర్ల జాబితాను అగ్రదేశానికి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు భద్రతా ఏజెన్సీలు ఓ నివేదిక రూపొందించాయని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి గోల్డీ బ్రార్, అన్మోల్ బిష్ణోయ్ సహా జాతీయ దర్యాప్తు సంస్థ వాంటెడ్ జాబితాలో ఉన్న గ్యాంగ్‌స్టర్ల పేర్లు ఆ నివేదికలో ఉన్నాయి. కేంద్ర హెూం మంత్రిత్వ శాఖ ఆదేశాలకు అనుగుణంగా ఇది రూపొందింది. విదేశాల్లో ఉంటున్న నేరగాళ్ల జాబితా కేంద్ర సంస్థల వద్ద ఇప్పటికే ఉంది. అయితే కొన్ని వారాల క్రితం ప్రత్యేకించి యూఎస్ కేంద్రంగా ఉన్న వారి జాబితాను సిద్ధం చేయాలని మంత్రిత్వ శాఖ తన ఆదేశాల్లో పేర్కొన్నట్లు సమాచారం.

పేజి 2లో

## సమ్మక్క-సారలమ్మ చిన్న జాతర.. పెద్దసంఖ్యలో తరలివస్తున్న భక్తులు



వనదేవతలు సమ్మక్క, సారలమ్మ చిన్న జాతర బుధవారం ప్రారంభం కానుంది. నేటి నుంచి ఈ నెల 15 వరకు నాలుగు రోజులపాటు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్ల దర్శనానికి తరలివస్తున్నారు. బెల్లం సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. బుధవారం తెల్లవారుజాము నుంచే భారీ సంఖ్యలో భక్తులు క్యూలైన్లలో వేచిఉన్నారు. రూ.5.30 కోట్లతో మినీ మేడారం జాతరకు ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తెలంగాణ జిల్లాల నుంచే కాకుండా పలు రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరానున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ 200 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. వెయ్యి మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. జంపన్నవాగు వద్ద స్నానాలు, దుస్తులు మార్చుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

పేజి 2లో

## వరంగల్ వచ్చే ధైర్యం లేక రాహుల్ గాంధి పారిపోయారు : కల్వకుంట్ల కవిత



2లో

## సింగరేణి రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ల నిలిపివేత.. గుర్తింపు సంఘం ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

2లో

## పథకాల్లో కోతలు..

### జీతాలు చెల్లించకుండా ఉద్యోగులకు వాతలు: హరీశ్ రావు

ఒకటో తారీఖునే ఉద్యోగులకు జీతాలంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం.. 12 రోజులు గడుస్తున్నా హెూంగార్డులకు జీతాలు చెల్లించకపోవడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు.



2లో

## బీసీ జాతుల గొంతు మీద కాలు పెడ్తామంటే ఊరుకోం బిడ్డా.. అంతు చూస్తాం: తీన్మార్ మల్లన్న



బీసీ జాతుల గొంతు మీద కాలు పెడ్తామంటే ఊరుకోం బిడ్డా.. అంతు చూస్తాం: తీన్మార్ మల్లన్న హైదరాబాద్: ఎవరైనా బీసీ జాతుల గొంతు మీద కాలు పెడ్తామ్ అంటే ఊరుకోం బిడ్డా.. మీ అంతు చూస్తామని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాట్ కామెంట్స్ చేశారు. బంజారాహిల్స్ కళింగభవన్?లో తెలంగాణ ప్రభుత్వ కులగణన సర్వే రిజర్వేషన్ల పూర్వాపరాలు, సమస్యలు, ఆందోళనకర అంశాలు, పరిష్కార మార్గాలు అంశంపై బుధవారం (ఫిబ్రవరి 12) మేధోమధన సదస్సు నిర్వహించారు. -పీపుల్స్ కమిటీ ఆన్ క్యాస్ట్ సెన్సెస్, అల్ ఇండియా బ్యాక్ వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్ , తెలంగాణ బ్యాక్ వర్డ్ క్లాస్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు తీన్మార్ మల్లన్న హాజరై ప్రసంగించారు.

పేజి 2లో

## హైదరాబాద్‌లో 'మీసేవ' కేంద్రాల వద్ద భారీగా రద్దీ



- **నగరంలోని 'మీసేవ' కేంద్రాల్లో భారీగా రద్దీ నెలకొంది. కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు బారులు తీరారు.**

నగరంలోని 'మీసేవ' కేంద్రాల్లో భారీగా రద్దీ నెలకొంది. కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు బారులు తీరారు. బుధవారం ఉదయం నుంచే పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఆధార్ అప్‌డేట్ కోసమూ తరలి వస్తున్నారు. జనం భారీగా వస్తుండటంతో మీసేవ కేంద్రాలు కిక్కిరిసిపోతున్నాయి. గంటల కొద్దీ పడిగాపులు కాస్తున్నామని.. ప్రభుత్వం చెప్పిన రుసుం కంటే ఎక్కువగా వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పేజి 2లో

## కులగణన సర్వేలో పాల్గొనని వారికి మరో అవకాశం: భట్టి విక్రమార్క

- **తెలంగాణలో కులగణన సర్వే శాస్త్రీయంగా పూర్తైందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సర్వేలో పాల్గొనని వారికి ఈనెల 16 నుంచి 28 వరకు మరో అవకాశం కల్పించారు.**
- **బీసీలకు 42% రిజర్వేషన్లపై మార్చి మొదటి వారంలో కేబినెట్ తీర్మానం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది.**
- **శాసనసభలో బిల్లు ఆమోదం తర్వాత చట్టబద్ధం చేసి, కేంద్ర ప్రభుత్వానికి పంపే విధంగా కార్యాచరణ కొనసాగుతోంది.**
- **ఓబీసీ రిజర్వేషన్ల కోసం వివిధ పార్టీ నాయకులను కలుస్తామని, రాజకీయ లబ్ధికి కాకుండా మద్దతు ఇవ్వాలని భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.**




తెలంగాణలో కులగణన సర్వే శాస్త్రీయంగా జరిగిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వివిధ కారణాల వల్ల కులగణన సర్వేలో పాల్గొనని వారి కోసం మరో అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈనెల 16 నుంచి 28 వరకు సర్వే సిబ్బందికి వివరాలు అందజేయాలని సూచించారు. రాష్ట్ర జనాభా లెక్కల్లోకి వచ్చే విధంగా అందరూ చూసుకోవాలని కోరారు. "బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై మార్చి మొదటి వారంలో కేబినెట్ తీర్మానం చేయనుంది. శాసనసభలో బిల్లు ఆమోదం చేసి చట్టబద్ధం చేయాలని నిర్ణయించాం. కులగణన బిల్లును కేంద్ర ప్రభుత్వానికి పంపుతాం. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పార్లమెంట్‌లో ఆమోదానికి కృషి చేస్తాం. ఓబీసీల రిజర్వేషన్ల కోసం వివిధ పార్టీల నాయకులను కలుస్తాం. దశాబ్దాల ఓబీసీల కలలను నిజం చేసేందుకు కృషి చేస్తాం. రిజర్వేషన్లపై రాజకీయపరంగా కుట్రలు చేస్తే తిప్పి కొడతాం. రాజకీయ లబ్ధి పక్కన పెట్టి మద్దతు పలకాలని కోరుతున్నాం" అని భట్టి విక్రమార్క అన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
గురువారం ఫిబ్రవరి 13 2025

## జీత్ వెనుక నిజమైన శక్తి ఎవరంటే? : గౌతమ్ అదానీ



: ప్రముఖ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ చిన్న కుమారుడు జీత్ అదానీ , దివా జైమిన్ షా ల వివాహం ఇటీవల వైభవంగా జరిగిన సంగతి తెలిసిందే. ఈ వివాహ వేడుకలో గౌతమ్ అదానీ భావోద్వేగ ప్రసంగం చేశారు. జీత్ అదానీ– ప్రీతి అదానీ మధ్య ఉన్న ప్రత్యేక బంధాన్ని గురించి ఆయన వివరించారు.

"జీత్– దివా వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. ఇవి కేవలం మాకు ఆనంద క్షణాలు మాత్రమే కాదు. ఎంతో మంది పేదల జీవితాలను మార్చే కార్యక్రమాలకు నాంది పలుకుతోంది. వీరిద్దరూ జీవితాంతం దాతృత్వం, బాధ్యతలను పంచుకుంటూ గడపాలి" అని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తన సతీమణి ప్రీతి అదానీ గురించి ప్రస్తావిస్తూ.. ఆమెను కొనియాడారు.

అమ్మ నీ వెంటే..

"ఒక మహిళ బిడ్డకు జన్మనివ్వడం మాత్రమే కాకుండా.. తన చిన్నారి కలల కోసం ఏకంగా ఆమె జీవితాన్ని అంకితం చేస్తుందనడంలో సందేహం లేదు. జీత్ అదానీ వెనుక ఉన్న నిజమైన శక్తి అతడి తల్లి ప్రీతి అదానీ. ఆమె ప్రేమే అతడిని మార్గనిర్దేశం చేస్తూ ముందుకు నడిపించింది. నువ్వు (కుమారుడిని ఉద్దేశిస్తూ) జీవితంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నావ్. మీరు వేసిన ప్రతీ అడుగు ఆమె పంచిన ప్రేమ, త్యాగాల ఫలితమే అనే విషయాన్ని గుర్తు పెట్టుకో. ఆమె మీకు బలం. క్లిష్ట పరిస్థితులోనూ 'అమ్మ' మీ వెంట ఉంటుంది" అని గౌతమ్ అదానీ అన్నారు.

ఉచితాలు ఇస్తే.. ప్రజలు పని చేసేందుకు ఇష్టపడరు: సుప్రీంకోర్టు

కాగా.. గుజరాత్‌కు చెందిన ప్రముఖ వజ్రాల వ్యాపారి జైమిన్ షా కుమార్తె దివాతో.. జీత్ అదానీ వివాహం ఫిబ్రవరి 7న వైభవంగా జరిగింది. ఈ వేడుక సందర్భంగా అదానీ కుటుంబం మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఏటా 500 మంది దివ్యాంగ సోదరీమణులకు వివాహం నిమిత్తం ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని లక్ష్యం పెట్టుకుంది. ఈ ప్రయత్నం ద్వారా దివ్యాంగులైన ఆడబిడ్డలు, వారి కుటుంబాలు ఆనందం, గౌరవంతో ముందుకుసాగుతాయనే నమ్మకం కలుగుతోందంటూ గౌతమ్ అదానీ తన పోస్టులో ఇటీవల హర్షం వ్యక్తం చేశారు.

## వరంగల్ వచ్చే ధైర్యం లేక రాహుల్ గాంధీ పారిపోయారు : కల్వకుంట్ల కవిత

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వరంగల్ వచ్చే ధైర్యం లేక పారిపోయారని
బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జాగృతి మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకిచ్చిన హామీలపై నిలదీస్తారనే భయంతో రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని ఆరోపించారు.

వరంగల్ లో రాహుల్ గాంధీ చ్చిన రైతు డిక్లరేషన్ అమలే కాలేదని విమర్శించారు. ఇచ్చిన మాట తప్పితే ప్రజలు ఊరుకోబోరని అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు ఎక్కడా తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఇక్కడి కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మకం లేక ఎన్నికలప్పుడు ఢిల్లీ నుంచి నాయకులను తీసుకొచ్చారని విమర్శించారు.

సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ వచ్చి చిలుక పలుకులు పలికారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ( %=వఝుత్ష్ట =వ౦ఎఎ%) ముఖం కాదు. సోనియా, ప్రియాంక, రాహుల్ గాంధీల ముఖం చూసి మహిళలు కొంత వరకు ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు అయినా మహిళలకు 2500 ఇవ్వడం లేదు . రేవంత్ రెడ్డి మహిళలకు రూ .35 వేల చొప్పున బాకీ పడ్డారని ఆరోపించారు.

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో మార్చి 8న మహిళా శంఖారావం

రాష్ట్రంలో మహిళలకు భద్రత లేని పరిస్థితి ఏర్పడిందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో క్రైమ్ రేటు 20 శాతం పెరిగిందని అన్నారు. ఆడపిల్ల కాలేజీకి వెళ్తే ఇంటికొచ్చే వరకు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందని, శివారు ప్రాంతాల్లోని ఇళ్లలో దొంగలు చెలరేగుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఒక్క మతకల్లోలం జరగలేదని,రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాకా ఎక్కడో ఒక చోట తరుచూ మతకల్లోలాలు జరుగుతున్నాయి,రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని పేర్కొన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీటీవీల్లో 70 శాతం పనిచేయడం లేదని ఆరోపించారు.

భద్రత కోసం పోరాటం చేయాల్సిరావడం బాధాకరం

భద్రత కోసం కూడా మహిళలు పోరాటం చేయాల్సిరావడం బాధాకరమని అన్నారు. కేసీఆర్ పై అక్కసుతో కేసీఆర్ కిట్ లను నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మానవత్వం లేకుండా ప్రవర్తిస్తుందని కవిత దుయ్యబట్టారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి ఏర్పడిందని, ప్రభుత్వ ఆస్పత్రులపై శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చి బస్సుల సంఖ్యను తగ్గించారని, బీడీ కార్మికులకు పెన్షన్ ను 4 వేలకు పెంచుతామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## సింగరేణి రిటైర్డ్ కార్మికులకు పెన్షన్ల నిలిపివేత.. గుర్తింపు సంఘం ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

మొదటిపేజీ తరువాయి

గోదావరిఖని: సింగరేణిలో 2021 జూలై 1 నుంచి పదవి విరమణ చేసిన ఉద్యోగుల సవరించిన పెన్షన్‌ను చెల్లించకుండా నిలిపివేశారు. పదో వేజ్ బోర్డుకు సంబంధించిన వేతనాల పెన్షన్లు మాత్రమే ఇంతకాలం చెల్లిస్తూ వస్తున్న సింగరేణి యాజమాన్యం ఇప్పుడు పెన్షన్లను నిలిపివేయడంతో ఆందోళన వ్యక్తమవుతున్నది. సింగరేణి వ్యాప్తంగా దాదాపు 3 వేల మంది రిటైర్డ్ కార్మికులు ఫిబ్రవరి నెలలో పెన్షన్ రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పదో వేజ్ బోర్డ్ కాల పరిమితి 2021 జూన్‌తో ముగిసింది. అయితే వేజ్ బోర్డు కాల పరిమితి ముగిసిన ఏడాదిలోపే 11వ వేజ్ బోర్డుకు సంబంధించి ఒప్పందం కుదిరింది. దీంతో పెరిగిన వేతనాలకు సంబంధించి 11వ వేజ్ బోర్డు కాల పరిమితిలో రిటైర్ అయిన కార్మికులకు బేసిక్‌లో 25 శాతం పెన్షన్‌గా చెల్లించాల్సి ఉంటుంది.

ఒప్పందం కుదిరిన కొన్ని నెలల తర్వాత రిటైర్ అయిన కార్మికులకు కొత్త బేసిక్‌పై పెన్షన్లు చెల్లించినప్పటికీ ఒప్పందం కాకముందు వేజ్ బోర్డు 11 కాల పరిమితిలో రిటైర్ అయిన కార్మికుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది. సంవత్సరాలు గడుస్తున్నా ఏరియర్స్, పెన్షన్ చెల్లించకుండా కాలయాపన చేయడంతో పాటు ఫిబ్రవరి నెల నుంచి దాదాపు 3 వేల మంది రిటైర్ కార్మికులకు సంబంధించిన పింఛన్లు నిలిపివేయడంతో వారు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ ఆందోళన చెందుతున్నారు. ప్రతి సంవత్సరం నవంబర్ డిసెంబర్ నెలలోనే జీవన్ ప్రమాణ పత్రాలు సమర్పించడం అవి సమర్పించిన తర్వాత కూడా పెన్షన్లు ఎందుకు నిలిపివేశారని రిటైర్డ్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పెన్షన్లు జాప్యం చేస్తే సహించేది లేదు: వాసిరెడ్డి సీతారామయ్య

నిలిపివేసిన పెన్షన్లు వెంటనే చెల్లించాలని పెన్షన్ ఏరియర్స్ బకాయిలు చెల్లించాలని, జనవరి నెలకు సంబంధించి నిలిపి వేసిన పెన్షన్లు వెంటనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ( గుర్తింపు సంఘం) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య డిమాండ్ చేశారు. ఇప్పటికే గోదావరిఖని సీఎంపీఎఫ్ కార్యాలయంలో కమిషనర్ పచౌరితో మాట్లాడానని, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు. ముఖ్యంగా సింగరేణి రిటైర్డ్ ఉద్యోగులకు ఈ నెలలో బ్యాంకు ఖాతాల్లో జమ కావాల్సిన రెగ్యులర్ పెన్షన్‌ను జీవన్ ప్రమాణ్ పత్రాలు ఆన్‌లైన్‌లో ఇచ్చినప్పటికీ ఎందుకు జమ చేయలేదని ప్రశ్నించారు. పెన్షన్లు జమచేయక పోవడంతో చాలా మంది రిటైర్డ్ ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని ఆయన తెలిపారు.

వెంటనే నిలిపి వేసిన రెగ్యులర్ పెన్షన్లు రిటైర్డ్ ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, అదే విధంగా పదకొండో వేజ్‌బోర్డులో దాదాపు వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగుల సవరణ పెన్షన్‌ను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగిన సవరణ పెన్షన్, ఏరియర్స్ కూడా చెల్లించాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ ఆర్డర్ కాఫీలు రాక చాలా మంది ఇబ్బందులకు గురవుతున్నారని, భర్త చనిపోతే భార్యకు వితంతు పెన్షన్ పొందేందుకు రివైజ్డ్ పీపీఓ కాపీ లేకపోవడంతో వితంతు పెన్షన్ దారులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. వారికి ఆర్డర్ కాఫీలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం దన్ బాద్ లోని సీఎంపీఎఫ్ కమిషనర్‌కు లేఖ రాస్తానని, ఫిబ్రవరిలో రిటైర్డ్ ఉద్యోగుల పదకొండో వేజ్‌బోర్డు పెన్షన్ బకాయిలు చెల్లించాలని లేకుంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గోదావరిఖని సీఎంపీఎఫ్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

## హైదరాబాద్‌లో 'మీసేవ' కేంద్రాల వద్ద భారీగా రద్దీ

మొదటిపేజీ తరువాయి

రద్దీ పెరగడంతో సర్వర్లు మొరాయిస్తున్నాయని మీసేవ నిర్వాహకులు చెబుతున్నారు.

మరోవైపు రేషన్‌కార్డుల దరఖాస్తుల్లో గందరగోళం నెలకొంది. 'మీ సేవ' కేంద్రాల్లో దరఖాస్తుకు సంబంధించిన రసీదును పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో ఇవ్వాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. దీంతో ప్రజలు అక్కడికి వెళ్తున్నారు. భారీగా తరలి రావడంతో ఇటు మీసేవ కేంద్రాలు, అటు పౌరసరఫరాల కార్యాలయం వద్ద రద్దీ నెలకొంది. రెండు చోట్లా గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీసేవలో దరఖాస్తు చేశాక మళ్లీ రసీదు ఎందుకు ఇవ్వాలని మండిపడుతున్నారు.

కొత్త రేషన్ కార్డుల కోసం 'మీసేవ' కేంద్రాలకు భారీగా ప్రజలు తరలివస్తుండటంతో మరోసారి పౌరసరఫరాల శాఖ స్పందించింది. రేషన్ కార్డుల దరఖాస్తులపై క్లారిటీ ఇచ్చింది. "రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ. దరఖాస్తుల సమర్పణకు ఎలాంటి గడువు లేదు. దరఖాస్తుదారులు తొందరపడాల్సిన అవసరం లేదు. ప్రజావాణిలో దరఖాస్తు చేసిన వారు మళ్లీ చేయొద్దు. కులగణన, ప్రజాపాలనలో దరఖాస్తు చేస్తే మళ్లీ అవసరం లేదు. మీ సేవలో ఇచ్చిన రసీదు దాచిపెట్టుకోవాలి. దాన్ని ఎక్కడా ఇవ్వాల్సిన అవసరం లేదు" అని స్పష్టం చేసింది.

## బీసీ జాతుల గొంతు మీద కాలు పెడ్తామంటే ఊరుకోం బిడ్డా.. అంతు చూస్తాం: తీన్మార్ మల్లన్న

మొదటిపేజీ తరువాయి

మనం ఇప్పటి వరకు కులగణనలోని లోపాలను సమాజం ముందు పెట్టినం.. ప్రభుత్వం చేసిన బీసీ లెక్కలు తప్పు అనడానికి అనేక విధాలుగా ప్రజల ముందు ఉంచామన్నారు. మరీ ప్రభుత్వం బీసీ లెక్కల తప్పిదాలను ఎప్పుడు సరిచేస్తదో చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీల ఆర్థిక పరమైన లెక్కలు కూడా బయటికి రావాలని.. 2 లక్షల 91 వేల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు సగం రావాల్సిందేనన్నారు. ఉమ్మడి ఏపీ నుంచి కూడా బీసీలపై జరిగిన ఆర్థిక దోపిడి అంశాన్ని చర్చకు తీసుకోవాలని.. బీసీలకు జరిగిన అన్యాయన్ని అన్ని రంగాల్లో లెక్కలు తీస్కొని ప్రజలకు వివరించాలని కోరారు. బీసీలకు సీట్లు పార్టీలు వేసే బిచ్చమ్ అని.. అదే రిజర్వేషన్స్ మాత్రం రాజ్యాంగం మనకు కల్పించిన హక్కు అని అన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలనే గెలిపించాలి.. ఆ దిశగా మనం ప్రణాళిక రచించాలి.. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మైండ్ బ్లాక్ అయ్యే రిజల్ట్ ఉండాలని బీసీలకు పిలుపునిచ్చారు. బీసీల కోసం గొంతెత్తి నాకు పార్టీ నోటీసులు ఇస్తే.. ఈ సభ నాకు మద్దతుగా నిలిచిందని ధన్యవాదాలు తెలిపారు. బీసీ రిజర్వేషన్స్ సాధించడమే మా అందరి అంతిమ లక్ష్యమని స్పష్టం చేశారు. ఇప్పుడున్నది గత తెలంగాణ కాదు.. ఎడ్డి తెలంగాణ కాదు.. చైతన్యం ఉన్న తెలంగాణ.. బీసీలు చైత్యంతో ఉన్నారని అన్నారు. జిల్లా, గ్రామీణ ప్రాంతంలో బీసీలు చర్చ పెట్టాలని.. తీన్మార్ మల్లన్న టీంలో ఆధ్వర్యంలో కొన్ని గ్రామాల్లో జనాభా లెక్కలు తీస్తామని.. ఆ లెక్కలను గ్రామ పంచాయతీ దగ్గర అతికిస్తామని పేర్కొన్నారు.

## పథకాల్లో కోతలు..


### జీతాలు చెల్లించకుండా ఉద్యోగులకు వాతలు: హరీశ్ రావు

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్: ఒకటో తారీఖునే ఉద్యోగులకు జీతాలంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం.. 12 రోజులు గడుస్తున్నా హెూంగార్డులకు జీతాలు చెల్లించకపోవడంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా 16వేలకు పైగా ఉన్న హెూం గార్డులకు 12 రోజులు గడస్తున్నా జీతాలు చెల్లించకపోవడం సిగ్గుచేటన్నారు. చిన్న జీతాలపైనే ఆధారపడి జీవిస్తున్న హెూంగార్డులు.. చేతిలో చిల్లిగవ్వలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. 'ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజులు, రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చెయ్యాల్సిన దుస్థితి.

ఈఎంఐలు చెల్లించకపోవడం వల్ల బ్యాంకు అధికారులు ఫోన్లు చేసి నిలదీస్తున్న పరిస్థితి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రతి నెలా ఇదే తీరు కొనసాగుతున్నా పట్టించుకునే వారే లేరు. మాటలు కోటలు దాటితే, చేతలు గడప దాటని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీరికి ఏం సమాధానం చెబుతారు?. పథకాల్లో కోతలు, జీతాలు చెల్లించకుండా ఉద్యోగులకు వాతలు.. ఇది ప్రజా పాలన కాదు, ప్రజా వ్యతిరేక పాలన. హెూంగార్డులకు వేతనాలు తక్షణం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.' అంటూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

## శ్రీశ్రీశ్రీ మాణిక్య ప్రభువుల 78వ వార్షికోత్సవం...





వికారాబాద్ జిల్లా పరిగి మండలం మిట్ట కోడూరు గ్రామంలో 78వ వార్షికోత్సవ కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం గ్రామంలో ప్రధాన రహదారుల గుండా మాణిక్య ప్రభు పల్లకి సేవ, ఊరేగింపు, కోలాటం , భజన పాటలతో రహదారులు కిట కిటలాడినాయి.మిట్ట కోడూరు చుట్టు పది గ్రామాలు ఇబ్రహీంపూర్, లక్నాపూర్, చిగురాల్ పల్లి , గడిసింగాపుర్, రంగంపల్లి , పరిగి , సుల్తాన్పూర్ నుంచి భారీగా ప్రజలు తరలిరావడం జరిగింది.మాణిక్ ప్రభు దేవాలయంలో యజ్ఞ కార్యక్రమం వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛారణాల మధ్యన ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పటేల్ జయలక్ష్మి జగదీశ్వర్, పరివేద అనంతరెడ్డి, మాజీ ఎంపీటీసీ మాణిక్యం, పరివేద శ్రీనివాస్ రెడ్డి, మాణిక్యం, మల్లయ్య, రాజలింగం, భవదీయులు మాణిక్య ప్రభు భక్తబృందం, మిట్ట కోడూరు గ్రామం తో పాటు చుట్టూ గ్రామాల భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## సమ్మక్క-సారలమ్మ చిన్న జాతర.. పెద్దసంఖ్యలో తరలివస్తున్న భక్తులు

మొదటిపేజీ తరువాయి

కాగా, ప్రతి రెండేళ్లకోసారి జరిగే అమ్మవార్ల మహాజాతర అనంతరం వచ్చే ఫిబ్రవరిలో మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని మేడారం, కన్నెపల్లిలో సమ్మక్క, సారక్క పూజారులు ఆయా పూజా మందిరాల్లో మండెమెలిగే పండుగను నిర్వహిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లన్నీ పూర్తచేశారు. ఈ సందర్భంగా పూజారులు ఆయా గ్రామాల్లో డోలివాయిద్యాల నడుమ గ్రామదేవత, బొడ్రాయిల వద్ద ప్రత్యేక పూజలు చేసి, అనంతరం దుష్టశక్తులు గ్రామంలోకి రాకుండా బురుకు కట్టెలతో గ్రామ పొలిమేరలో మా మిడి ఆకులతో పాటు కోడి పిల్లతో తోరణాలు కడతారు.

అనంతరం పూజారులతో పాటు వారి కుటుంబసభ్యులు, బంధువులు సమ్మక్క–సారక్కల పూజా మందిరాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. అమ్మవార్ల మి నీ జాతర ముగిసే వరకు సమ్మక్క, సారక్క ప్రధాన పూజారులు కొక్కెర కృష్ణయ్య, కాక సార య్య అత్యం త నియమనిష్టలతో తల్లులకు పూజలు నిర్వహిస్తారు. బుధవారం రాత్రంతా గద్దెల వద్ద జాగారం చేసి అనంతరం ఒకరికి ఒకరు సాకను ఇచ్చిపుచ్చుకుంటారు. దీంతో మినీ జాతర ప్రారంభమవుతుంది. తల్లులను గద్దెల మీదకు తీసుకురావడం మినహా మహాజాతర సందర్భంగా అమ్మవార్లకు జరిగిన పూజా కార్యక్రమా లు యథావిధిగా కొనసాగుతాయి. బుధ, గురు, శు క్రవారాల్లో భక్తులు మొక్కులు చెల్లించుకున్న అనంతరం అమ్మవార్ల పూజా సామగ్రిని శుద్ధి చేసిన అనంతరం గుడిలో భద్రపరచడంతో మినీ జాతర ముగుస్తుంది.

### వివిధ మార్గాల నుంచి వచ్చే వారికి రూట్ల కేటాయింపు

మినీ మేడారం జాతరకు వివిధ మార్గాల నుంచి వచ్చే భక్తులకు రోడ్డు మార్గాలతో పాటు రూట్లను కేటాయించినట్లు ఎస్పీ పీ శబరీశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ నుంచి వచ్చే భక్తుల కోసం ఒక రూట్, భూపాలపల్లి, కరీంనగర్ మీదుగా రెండో రూట్, ఏటూరునాగారం, కొత్తగూడెం మీదుగా మూడో రూట్, ఆర్టీసీ బస్సుల ద్వారా పస్రా, తాడ్వాయి మీదుగా వచ్చే భక్తుల కోసం 4వ రూట్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వీవీఐపీ భక్తుల కోసం శ్రీరాంసాగర్ చెరువు పక్కన పార్కింగ్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.

### ఆర్టీసీ స్పెషల్ బస్సులు

ఈనెల 12, 13, 14వ తేదీల్లో సమ్మక–సారలమ్మ మినీ మేడారం జాతర జరుగుతున్న నేపథ్యంలో బస్సుల సౌకర్యార్థం ఆర్టీసీ వరంగల్ రీజియన్ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్ఎం డీ విజయభాను తెలిపారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఉదయం 6 గంటల నుంచి మేడారానికి బస్సులు నడుపుతున్నట్లు, ప్రత్యేక బస్సుల ఆపరేషన్ నిర్వహణకు హనుమకొండ, మేడారం బస్టాండ్‌లో ఆర్టీసీ అధికారులు 24 గంటలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అన్ని ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో మహిళలు, ఆడపిల్లలకు మహాలక్ష్మీ పథకం వర్తిస్తుందని, ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. జాతర బస్సుల చార్జీలు ఎక్స్‌ప్రెస్ రూ.200(పెద్దలు), రూ.110( పిల్లలు), ఈ–ఎక్స్‌ప్రెస్ రూ.210(పెద్దలు), రూ. 120( పిల్లలు) ఉంటుందని ఆర్ఎం తెలిపారు.

జాతర పరిసరాల్లో కానరాని మరుగుదొడ్లు

అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకార్యర్థం జాతర పరిసరాల్లో మరుగుదొడ్లు కానరావడం లేదు. దీంతో మేడారం వచ్చే భక్తులు కాలకృత్యాలు ఎలా తీర్చుకోవాలనేది ప్రశ్నార్థకంగా మారింది. జాతరకు రూ. కోట్లు వెచ్చించి సౌకర్యాలు కల్పించామని చెబుతున్న ప్రభుత్వం, అధికారులు ఒక్క మరుగుదొడ్డిని కూడా ఏర్పాటు చేయకపోవడం ఆశ్చర్యంగా ఉంది.

ప్రస్తుతం ఆర్టీసీ బస్టాండ్, గద్దె ల వెనకభాగం, సారలమ్మ ఓట్‌గేట్ సమీపంలో, జంపన్నవాగు వద్ద సులభ్ కాంప్లెక్స్‌లు ఉండగా, ఐటీడీఏ క్యాంపు కార్యాలయం సమీపంలో మరో మినీ సులభ్ కాంప్లెక్స్ ఉంది. వీటిలో సుమారు 40 దాకా మరుగుదొడ్లు ఉన్నాయి. మినీ జాతరకు సుమారు 40 లక్షల మంది భక్తులకు ఈ టాయిలెట్లు సరిపోతాయా అనేది అధికారులకే తెలియాలి.

## అమెరికాలో నక్కిన గ్యాంగ్‌స్టర్లు.. జాబితా సిద్ధం చేసిన భారత్..!

మొదటిపేజీ తరువాయి

బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్ ఇంటి బయట కాల్పుల ఘటన సహా పలు కేసుల్లో నిందితుడు అన్మోల్ బిష్ణోయ్ అమెరికాలో ఉన్నట్లు ముంబయి పోలీసులకు ఇప్పటికే సమాచారం ఉంది. అతడి కదలికలకు సంబంధించిన వివరాలను అమెరికా అధికారులు.. పోలీసులతో పంచుకున్నారు. దీంతో అతడిని భారత్‌కు రప్పించే ప్రయత్నాలు ఇప్పటికే కొనసాగుతున్నాయి. కొన్ని నెలల క్రితం ముంబయిలో సంచలనం సృష్టించిన బాబా సిద్ధిఖీ హత్య కేసు నిందితులతోనూ అన్మోల్ టచ్‌లో ఉన్నాడు. 2022లో జరిగిన ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య కేసులోనూ అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. అన్మోల్‌పై దాదాపు 18 కేసులు వివిధ ప్రాంతాల్లో నమోదయ్యాయి. ఇతడి గురించి సమాచారం ఇచ్చిన వారికి రూ.10 లక్షల నగదు బహుమతి ఇస్తామని ఇటీవల జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) ప్రకటించిన సంగతి తెలిసిందే.

గోల్డీ బ్రార్‌గా ప్రచారంలో ఉన్న సతీందర్ సింగ్ భారత్‌లో మోస్ట్‌వాంటెడ్ క్రిమినల్. అతడు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌లో అత్యంత కీలకమైన సభ్యుడు. 2022లో జరిగిన సిద్ధూ మూసేవాలా హత్య కేసులో ఒక్కసారిగా ఇతడి పేరు మార్మోగింది. మరోవైపు బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఇంటి పైకి కాల్పులు జరిపిన ఘటనలో కూడా గోల్డీబ్రార్ పేరు వినిపించింది. అతడు కూడా అమెరికాలోనే ఉన్నాడు.

కరపత్రం తెలుగు దిన పత్రిక

గురువారం ఫిబ్రవరి 13 2025


# ప్రభుత్వ భూములు కాపాడండి తాసిల్దార్ కు వినతి పత్రం





**కాసాల గ్రామ శివారులోని 336 సర్వే నెంబర్లో గల ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని ప్రభుత్వం స్వాధీనపరచుకొని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సంగారెడ్డి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు నరసింహులు పేర్కొన్నారు-**

**కరపత్రంఫిబ్రవరి 12 సంగారెడ్డి జిల్లా**
హత్నూర మండలం కాసాల గ్రామ శివారు లో 336 సర్వేనెంబర్ లో గల ప్రభుత్వ భూములను కొంతమంది కబ్జా చేసి ఇతరులకు రెంటుకిస్తున్నటువంటి పరిస్థితి ఉంది. అట్టి భూమిలో 2007-2008 సంవత్సరంలో అట్టి భూమిలో తాసిల్దార్ నాగేష్ ప్రభుత్వ భూమి అని బోర్డులు పెట్టారు ఆ బోర్డులను తొలగించి కబ్జా చేశారు పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం అర్హుల జాబితాను ప్రకటించింది. అట్టి భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకోవడం సరైనది కాదు. ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనపరచుకొని ప్రభుత్వ సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి. పేదల ఇళ్ల స్థలాలకు దక్కాల్సినటువంటి భూములు కొంతమంది అనర్హులు కబ్జా చేశారు వారిపై చర్యలు తీసుకుని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ కోరుతుంది శేఖర్ బి ఇంద్రసేన రమేష్. గఫూర్



తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం
సంగారెడ్డి జిల్లా కమిటీ

శ్రీయుత గౌరవనీయులైన,
తహసీల్దార్,
హత్నూర మండలం గారికి.

తేది :11-02-2025.

విషయము:- కాసాల గ్రామంలోని 336 సర్వే నెంబర్లో గల ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని ప్రభుత్వం స్వాధీనపరచుకొని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుట గురించి.

ఆర్య!

హత్నూర మండలం కాసాల గ్రామంలో 336 సర్వేనెంబర్ లో గల ప్రభుత్వ భూములను కొంతమంది కబ్జా చేసి ఇతరులకు రెంటుకిస్తున్నటువంటి పరిస్థితి ఉంది. అట్టి భూమిలో 2007-2008 సంవత్సరంలో పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వడానికి ప్రభుత్వం అర్హుల జాబితాను ప్రకటించింది. అట్టి భూమిని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకోవడం సరైనది కాదు. ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనపరచుకొని ప్రభుత్వ సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి. పేదల ఇళ్ల స్థలాలకు దక్కాల్సినటువంటి భూములు కొంతమంది అనర్హులు కబ్జా చేశారు వారిపై చర్యలు తీసుకుని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సంగారెడ్డి జిల్లా కమిటీ కోరుతుంది.

అభినందనలతో
(ఎం.నర్సిములు)
జిల్లా ప్రధాన కార్యదర్శి
సెల్:9490098697

## పల్లె దవఖానకు ఫర్నిచర్ అందజేసిన సంఘ సేవకుడు అయిత పరంజ్యోతి





**కరపత్రం చేగుంట ప్రతినిధి ఫిబ్రవరి 12,**
మెదక్ జిల్లా చేగుంట మండల కేంద్రంలో ని పల్లె దవఖాన కు ప్రముఖ సంఘ సేవకులు అయిత పరంజ్యోతి 4 కుర్చీలు, ఫ్యాన్ అందజేశారు. పల్లె దవఖాన కు వచ్చిన వారికి ఇబ్బందులకు గురి అవుతున్నారని, ఇట్టి విషయం పై కాలనీ వాసులు కోరగా, కోరిన వెంటనే నాలుగు కుర్చీలు ఫ్యాను అందజేసినందుకు అయిత పరంజ్యోతికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు కాలనీ వాసులు .ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జ్యోతి, కాలనీవాసులు గడ్డమీద రఘుపతి, పులబోయిన రఘు, లక్ష్మణ్, శివకుమార్, కృష్ణ, మల్లమ్మ, అంగన్వాడి టీచర్ సుగుణ, ఆశ వర్కర్లు, పల్లె దావఖాన సిబ్బంది,కాలనీ ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి...

**పరిగి కరపత్రం ఫిబ్రవరి 12**
వికారాబాద్ జిల్లాలోని మహిళా శిశుసంక్షేమ శాఖలోని మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడవో పది సంవత్సరాల వేడుకలో భాగంగా పరిగి నియోజకవర్గంలోని అన్ని కేజీబీవీ పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, కోకో ఆటల పోటీలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథి గా వికారాబాద్ జిల్లా అసిస్టెంట్ కలెక్టర్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ఉమా హారతి పాల్గొని జెండా ఊపి ఆటల పోటీలను ప్రారంభించడం జరిగింది.
కబడ్డీ, కోకో జట్టుతో మొదట మండల్ లెవల్లో ఆడించి మండల్ లెవల్లో గెలుపొందిన వారిని నియోజకవర్గం లెవెల్లో ఆటలు పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలో కబడ్డీ మొదటి స్థానంలో



నిలిచిన దోమ కేజీబీవీ విద్యార్థులు, కోకో మొదటిస్థానంలో పూడూరు కేజీబీవీ విద్యార్థులు విజయం సాధించారు. వారు మాట్లాడుతూ....ఆటలు ఆడడం వల్ల శారీరకంగా, మానసికంగా ఆరోగ్యం గా నే కాకుండా మనిషి దృడంగా ఉంటారని ప్రతీ ఒకరు ఆటలకు సమయం ఇవ్వాలని ఆటల లో చురుకుగా



ఉంటే చదువులో కూడా ముందుంటారని విద్యార్థుల కు చదువు తో పాటు ఆటలు చాలా అవసరం అని అన్నారు.ఈ కార్యక్రమం లో నియోజకవర్గంలోని కేజీబీవీ
విద్యార్థులు, ఉపాధ్యాయులు, మహిళా సాధికారత బృందం పాల్గొనడం జరిగింది.

## శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ని దర్శించుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గౌడ్



**కరపత్రం చేగుంట ప్రతినిధి ఫిబ్రవరి 12,**
మెదక్ జిల్లా చేగుంట మండలం కర్నాల్ పల్లి గ్రామంలో వెలిసినటువంటి శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయానికి విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారి ఆశీస్సులు తీసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గౌడ్, అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ రామ గౌడ్ , శాలువా, పూలదండతో సత్కరించారు.
ఈ కార్యక్రమంలో రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు రామ గౌడ్ , బాలేశం గౌడ్, సీనియర్ నాయకులు కొత్త దేవి రెడ్డి, అనిల్ గౌడ్, వెంకటరెడ్డి, రాజు, స్వామి, కామోజీ అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

## దోమ మండల నూతన ఎంపీఓ గా రాజేష్

**దోమకరపత్రం ఫిబ్రవరి 12**



దోమ మండల ఎంపీఓ గా విధులు నిర్వహించిన సోమలింగం చౌడాపూర్ మండలానికి బదిలీపై వెళ్లినందున అతని స్థానంలో నూతన ఎంపీఓగా రాజేష్ కి బాధ్యతల అప్పగించారు.దోమ మండలం దిర్సంపల్లి గ్రామా పంచాయతీ కార్యాలయానికి రాజేష్ రావడంతో అతన్ని సన్మానించిన దిర్సంపల్లి గ్రామ మైనార్టీ నాయకులు.ఈ కార్యక్రమంలో అబ్దుల్ రహుఫ్, అఖిల్, రహీం, గౌస్ పటేల్, ఉమర్ అలీ, అజార్, సలీం ,బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాపోల్ గ్రామం కొత్త కాలనీ లో రోడ్డు,అండర్ డ్రైనేజ్, మోరీల పనులు ప్రారంభం...

**పరిగి కరపత్రం ఫిబ్రవరి 12**
పరిగి మండలం రాపోలు గ్రామంలో కొత్త కాలనీలో బుధవారం అండర్ డ్రైనేజ్ మోరీల పని మొదలు పెట్టిన గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గండు వెంకటేష్. బుధవారం కొత్త కాలనీలో రోడ్డు పనులు నిర్వహించారు.తాను మాట్లాడుతూ....ఎస్సీ సబ్ ప్లాన్ కింద 5 లక్షల రూపాయలు మంజూరు కావడం జరిగింది అని అన్నారు.ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి గత ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం పని మొదలు పెట్టడం జరిగింది అని అన్నారు. ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాపోలు గ్రామాన్ని పెద్ద ఎత్తున అభివృద్ధి చేసే బాధ్యత మేము తీసుకుంటాం అని తెలిపారు.ఈ



కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గండు వెంకటేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు నాగవర్ధన్,ఇందిరమ్మ కమిటీ సభ్యుడు ఉప్పరి రాకేష్ , వడ్ల ఈశ్వరయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గండు రామచంద్రయ్య, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొనడం జరిగింది.

## కబ్జా చేసిన భూమిని పరిశీలించిన తాసిల్దార్ కబ్జా చేస్తే కఠిన చర్యలే తాసిల్దార్ ఫర్హీన్ షేక్





**కరపత్రం ఫిబ్రవరి 12**
సంగారెడ్డి జిల్లా స్టాపర్ గోపాల్ హత్నూర మండలం కాసాల గ్రామ శివారులో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమి అంటూ వార్తా పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు రెవెన్యూ యంత్రాంగం కదిలింది.స్థానిక రెవెన్యూ అధికారులు సదరు భూమి వద్దకు చేరుకుని పరిశీలించారు.తహసీల్దార్ ఫర్హీన్ షేక్, ఆర్ శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శి స్వప్న అట్టి భూమిని సందర్శించారు.కబ్జాకు గురవుతున్న భూమిని స్వాధీనం చేసుకుని అందులో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎమ్మార్వో ఫర్హీన్ షేక్ ఆర్ఐ శ్రీనివాస్ ను ఆదేశించారు.కొందరు వ్యక్తులు ప్రభుత్వ భూములను ఆక్రమించి కబ్జాకు దిగుతున్నారని ఆమె అన్నారు.ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే చట్టరిత్యా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరిక చేశారు.

## మాణిక్య ప్రభు జాతర ఉత్సవాలలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిట్టా పరమేశ్వర్ రెడ్డి..



**పరిగికరపత్రం ఫిబ్రవరి 12**
పరిగి మండల లోని మిట్ట కోడూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ మాణిక్య ప్రభు జాతర ఉత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిట్ట పరమేశ్వర్ రెడ్డి, సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మల్లేష్ పటేల్,పూడూరు మండల అధ్యక్షులు రాఘవేందర్, పరిగి మండల మాజీ అధ్యక్షులు గంట శ్రీనివాస్ రెడ్డి,మిట్ట కోడూరు మాజీ సర్పంచ్ పటేల్ జయలక్ష్మి జగదీశ్వర్, పూడూర్ మండల్ ఉపాధ్యక్షులు కృష్ణ చారి, పరిగి మండల ఉపాధ్యక్షులు మల్లేష్, ప్రభు, రవి,బస్ రెడ్డి,శివ, పూడూర్ భూత్ అధ్యక్షులు సుభాన్, గంగుపల్లి భూత అధ్యక్షులు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## రెండు లక్షల ఎల్ఓసి కాపీని అందజేత

**పూడూర్ కరపత్రం ఫిబ్రవరి12**
పూడూరు మండల కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టీ.రామ్మోహన్ రెడ్డి సహకారం తో పూడూరు మండల పరిధి లోని సోమన్ గుర్తి గ్రామానికి చెందిన సిహెచ్ కృష్ణ అనారోగ్యంగా ఉన్నాడని తెలవగానే ఆయన కు మంచి వైద్యం అందించాలని సీఎం రిలీఫ్ ఫండ్ నుండి 2 లక్షల రూపాయల ఎల్ఓసి కాపీని సిహెచ్ కృష్ణ తల్లి సిహెచ్ లక్ష్మమ్మ కి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పట్లోళ్ల రఘునాథ్ రెడ్డి ,పూడూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురేందర్



ముదిరాజ్ ,మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ యు.భాస్కర్, మండల సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్రహం,కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి అలీ, ఎండి కద్దు, ఇలియాస్, ప్రేమ్ కుమార్ తదితరులు ఇవ్వడం జరిగింది.

## శ్రీశ్రీశ్రీ మాణిక్య ప్రభువుల వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మహేష్ రెడ్డి...

**పరిగి కరపత్రం ఫిబ్రవరి 12**
పరిగి మండలం మిట్ట కోడూరు గ్రామంలో మాణిక్ ప్రభు జాతర ఉత్సవాలలో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించిన పరిగి మాజీ శాసనసభ్యులు కొప్పుల మహేష్ రెడ్డి.జాతర సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న వీధి నాటకానికి ప్రోత్సాహకంగా 15 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, మాజీ ఎంపీపీ కరణం అరవింద్ రావు, సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి,మిట్ట కోడూరు మాజీ సర్పంచ్ పటేల్ జయలక్ష్మి జగదీశ్వర్, మిట్ట కోడూరు మాజీ ఎంపీటీసీ మాణిక్యం, నరోత్తం రెడ్డి , గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





## జెడ్పిటిసి రేసులో జర్నలిస్ట్ చదువుకున్న విద్యావంతున్నే గెలిపించుకుందాం

**కరపత్రం ఆదిలాబాద్ జిల్లా ఫిబ్రవరి 12**



గత పదేళ్లుగా ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉంటూ కలం తో ప్రజా సమస్యలను వెలికి తీసి అధికారుల దృష్టికి తీసుకెల్లి పరిస్కారాని కృషి చేసిన సాలిగామ మల్లేష్ జర్నలిస్ట్ మల్లన్న క్రియాశీల రాజకీయలోకి వస్తారని కొద్దీ రోజులుగా వస్తున్న వార్తలకు తెరదించారు. ఈ సందర్భంగా ఆయన మీడియా తో మాట్లాడుతూ.. ప్రజలు అభిమానుల అభిప్రాయం మేరకు రాబోయే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ అనుకూలిస్తే తాండూరు జెడ్పిటిసి గా పోటీచేస్థానని స్పష్టం చేశారు. కొన్ని ప్రజా సమస్యలపై కలం తో పరిష్కరం కావడం లేదు. ప్రజా ప్రతినిధి ఆయితే జిల్లా, మండల సర్వసభ్య సమావేశాల్లో ప్రజల గలంతో ప్రస్తావించి అభివృద్ధి కి కృషిచేయచ్చని అన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా లేక ఏదేని పార్టీ నుండి పోటీ అని డీసైడ్ కాలేదని అతి త్వరలో అభిమానుల అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటానని ప్రజలు ఆదరించి ఆశీర్వదించాలని కోరారు.

## పోలీసులకు సమాచారం అందిస్తున్నాడనే అనుమానంతో యువకుడిపై దాడి

**– తీవ్రంగా గాయపడ్డ యువకుడు-పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు**


**కరపత్రం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 12**



కాగజ్నగర్ పట్టణంలోని ద్వారకానగర్ కు చెందిన అక్రమ్ ఖాన్ పై మంగళవారం రాత్రి ముగ్గురు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాదారులు దాడికి పాల్పడ్డారు. స్థానిక చిన్న మసీదు ధగ్గర ఉన్న అక్రమ్ ఖాన్ ను రాత్రి ముగ్గురు బియ్యం అక్రమ రవాణాదారులు ఘెరావ్ చేసి విపరీతంగా చికతబాదారు. మంగళవారం ఉదయం సిర్పూర్ (టి) పోలీసులు మూడు వాహనాల్లో విరూర్ కు అక్రమంగా తరలిస్తున్న 208 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనపర్చుకున్న విషయం తెలిసిందే.అయితే ఈ బియ్యం వాహవానను నువ్వే పట్టించావని, పోలీసులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ..పోలీస్ ఇన్ఫార్మర్ గా మారావంటూ బూతులు తిడుతూ పిడిగుద్దులు కురిపిస్తూ తీవ్రంగా కొట్టారని బాధితుడు అక్రమ్ ఖాన్ తెలిపాడు. స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. త్రీవంగా గాయపడ్డ అక్రమ్ ఖాన్ ప్రస్తుతం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రి లో చికిత్స పొందుతున్నాడు.

## బర్డ్‌ఫ్లూపై అప్రమత్తమైన తెలంగాణ సర్కార్

**కరపత్రం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 12**



బర్డ్‌ఫ్లూపై అప్రమత్తమైన తెలంగాణ సర్కార్ బర్డ్‌ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. తెలంగాణ సరిహద్దుల్లో 24 చెక్‌పోస్ట్‌లు ఏర్పాటు చేసింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే మూడు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ఏపీ నుంచి తెలంగాణకు వస్తున్న కోళ్ల వాహనాలను అధికారులు వెనక్కి పంపుతున్నారు. రాష్ట్రంలో కొన్ని రోజులు చికెన్ తినవద్దని, జిల్లా కలెక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది.

## అగాపే ఆశ్రమంలో అన్నదానం.

**రాయలసీమ ఇంచార్జ్ ప్రతినిది కరపత్రం ఫిబ్రవరి 12**



యాడికి మండలం, కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో కడప జిల్లా వేంపల్లి వాస్తవ్యులు వేల్పుల శేఖర్,భార్య ముని కీర్తి వారి పెళ్లి రోజు శుభ సందర్భంగా ఆశ్రమంలోని వారికి అన్నదానం కార్యక్రమం .కుటుంబంతో కలిసి అగాపే ఆశ్రమానికి వచ్చి ఆశ్రమంలో ఉంటున్న అందరికీ అన్నదానం చేశారు.కూతురు త్రివిధ, అమ్మ వెంకటలక్ష్మమ్మ, నాన్న రామాంజనేయులు, అత్త విజయలక్ష్మి, మామ ముని ప్రసాద్,బావ మునీంద్ర, కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు పాల్గొన్నారు.ఇందు నిమిత్తమై ఆశ్రమ ఫౌండర్ బత్తల ప్రసాద్, ఆశ్రమంలోని వారంతా పెళ్లిరోజు శుభాకాంక్షలు చెప్తూ వారి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

## సిఐ రాజశేఖర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన నితీష్ గౌడ్.

**కూకట్ పల్లి కరపత్రం ఫిబ్రవరి 12**



కేపి.హెచ్.బి పోలీస్ స్టేషన్ రాజశేఖర్ రెడ్డిని కూకట్ పల్లి నియోజకవర్గం కేపి.హెచ్. బి డివిజన్ వైస్ ప్రెసిడెంట్ ఆర్ నితీష్ గౌడ్ బుధవారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి పుష్పగుచ్చాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నెలకొన్న పలు సమస్యలపై రాజశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్లారు. కాలనీలలో రాత్రివేళలలో నిఘా ఎక్కువగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. దీనిపై సిఐ రాజశేఖర్ రెడ్డి కూడా సానుకూలంగా స్పందించారని లా అండ్ ఆర్డర్ విషయంలో తమ కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారని అన్నారు.

# బర్డ్ ఫ్లూ నేపథ్యంలో చికెన్ సెంటర్లలో కోళ్లు స్వాధీనం

**– కమీషనర్ స్వయంగా చికెన్ సెంటర్లవద్ద చంపి వేలాడకట్టిన కోళ్లను స్వాధీనం**
**– బర్డ్ ఫ్లూప్రభలుతున్నందున జకొన్నాళ్ళపాటు కోడిమంసం విక్రయాలు నిలుపుదల**

**కరపత్రం దినపత్రిక ప్రతినిధి. ఫిబ్రవరి 12**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లాఉమ్మడివరం నియోజకవర్గం ముమ్మిడివరం నగర పంచాయతీ కమీషనర్ ఆద్వర్యంలో ముమ్మిడివరం పదిధిలోని చికెన్ సెంటర్లపై దాడులు నిర్వహిస్తున్నారు.తమ సిబ్బందితో కలిసి కమీషనర్ స్వయంగా చికెన్ సెంటర్లవద్ద చంపి వేలాడకట్టిన కోళ్లను స్వాధీనం చేసుకున్నారు.బర్డ్ ఫ్లూ ప్రభలుతున్నందున కొన్నాళ్ళపాటు కోడిమంసం విక్రయాలు నిలుపుదల చేయాలని చికెన్ సెంటర్ల






నిర్వాహకులకు కమీషనర్ ఆదేశాలు జారీచేసారు.ఒక షాపులో ఫ్రీజ్ లో నిలువచేసిన కుళ్లిపోయిన చికెన్ స్వాధీనం చేసుకుని దంపింగ్ యార్డులో దానిని కప్పిపెట్టారు.షాపు యజమానికి ఇరవై అయిదువేల రూపాయలు జరిమానా విధిస్తామని తెలిపారు.ప్రజలు కోడిమాంసం తినకుండా ఉండాలని బర్డ్ ఫ్లూ పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని కమీషనర్ విజ్ఞప్తి చేస్తున్నారు.

# మద్యం వద్దు చదువు ముద్దు 47 వ ఆర్టికల్ ప్రభుత్వం అమలు చేయాలి

**కరపత్రం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో ఫిబ్రవరి 12**

మద్యం బీర్ల ధరలు పెంచటం అంటే బడుగు బలహీన బహుజన బిడ్డల ఆర్థిక ఎదుగుదలను నరికి వేయటమే తీవ్రంగా ఖండించిన రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ నూనెల ఆచార్య పత్రిక ప్రకటనలో మాట్లాడుతూ ప్రభుత్వం మద్యం బీర్ల పై 15% ధరను పెంచడం అంటే 90 శాతం ఉన్న బహుజన బడుగు బలహీన కార్మిక కర్షక కూలి నాలి బిడ్డల నిరుద్యోగ యువకుల ఆర్థిక వనరులను కొల్లగొట్టడమే. ఒక్కొక్క మద్యం బీరుపై 30 నుంచి 40 రూపాయలు పెంచడం ద్వారా నెలకు 300 కోట్ల రూపాయల ఆదాయం పెరగడం సంవత్సరానికి దాదాపు 3600 కోట్ల బహుజన బిడ్డల కష్టార్జితం ఆర్థిక వనరులు కొల్లగొట్టడమే. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రభుత్వాలు రాజ్యాంగంలోని ఆదేశిక



సూత్రాలలో 47వ ఆర్టికల్ ప్రభుత్వాలు ప్రజలను ఆరోగ్యవంతులను చేయటం ద్వారా వారి జీవన ప్రమాణాలను పెంచడం ఆరోగ్య సంరక్షణ ముఖ్యమైన బాధ్యతగా చేయాలి. ప్రత్యేకించి ఆరోగ్యానికి భంగం కలిగించే మత్తు పానీయాలు నిషేధించాలి. కానీ ప్రభుత్వాలు మద్య వ్యాపారం చేయడం అధిక ధరలకు మద్యం అమ్మి ప్రజల ఆర్థిక వనరులను కొల్లగొట్టడం మద్యం త్రాగడం ద్వారా శారీరక ఆరోగ్యాలు దెబ్బతినడం జరుగుతుంది. ప్రభుత్వాలు మానవత్వ ధోరణితో ఆలోచించి ప్రజల ఆరోగ్యాలు ఆర్థిక వనరులతో పాటు వాళ్ళ ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేలా చూడాలని రాజ్యాంగ పరిరక్షణ వేదిక డిమాండ్ చేస్తుంది. విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్టు షాపులను నివారణ దిశగా మరియు ప్రజలు మద్యం అలవాటు నుండి బయటపడేలా డి అడిక్షన్ సెంటర్స్ అన్ని జిల్లా కేంద్రాలలో ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలని రాజ్యాంగ పరిక్షణ వేదిక సవినయంగా వేడుకుంటుంది రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ నూనెల ఆచార్య పత్రిక ప్రకటన లో తెలియజేశారు.

# ప్రజా వెలుగు: కాకినాడ జిల్లా పెదపూడి మండలం

**కరకుదురు దుర్గాదేవి గుడి మండపానికి శంకుస్థాపన**

కాకినాడ జిల్లా అనపర్తి నియోజకవర్గం పెదపూడి మండలం కరకుదురు గ్రామంలో దుర్గాదేవి గుడి దగ్గర ఫస్ట్ ఫ్లోర్ మండపానికి గ్రామ పెద్దలు అందరూ చేతుల మీదగా కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేశారు, ఈ మండపం నిర్మాణానికి కరకుదురు గ్రామానికి చెందిన మరెడ్డి సత్తిరాజు, అన్నవరం దంపతుల కుమారుడు కోడలు మరెడ్డి వీర్రాజు తేజస్విని దంపతులు గుడి మండపం నిర్మాణానికి 7 లక్షల 30 వేల రూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు, ఈ సందర్భంగా సింగినీడి దత్తుడు, వుంద్రు సత్యనారాయణ, పాఠం శెట్టి కాశీరాణి మాట్లాడుతూ కరకుదురు గ్రామంలో దుర్గాదేవి వెలసినప్పుడు నుంచి గ్రామం అభివృద్ధి చెందుతూ ఉందని, దుర్గాదేవి గుడి ఫస్ట్ ఫ్లోర్ నిర్మించడానికి కమిటీ వారు నిర్ణయించారని, మర్రెడ్డి వీర్రాజు తేజస్విని దంపతులు దుర్గాదేవి గుడి మండపం ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణానికి 7 లక్షల 30 వేల రూపాయలు ఇవ్వడం జరిగిందన్నారు, ఎంత ఎత్తుకు



ఎదిగినా ఒదిగి ఉండాలనే ఉద్దేశంతో కన్నతల్లి కన్న ఊరు రుణ తీర్చుకోవాలని ఉద్దేశంతో గ్రామానికి చెందిన మరెడ్డి వీర్రాజు వారి కుటుంబ సభ్యులు కలిసి వారితండ్రి మరెడ్డి సత్తిరాజు జ్ఞాపకార్థం దుర్గాదేవి కి కళ్యాణ మండపం నిర్మించడం జరుగుతుందన్నారు, గ్రామస్తులంతా ఆయనకు ధన్యవాదములు తెలియజేస్తున్నామని, పతి యువత కూడా కన్న ఊరును మర్చిపోకుండా మరెడ్డి వీర్రాజు బాటలో నడవాలని, అమ్మవారి ఆశీస్సులతో పతి యువత కూడా కరకుదురు గ్రామానికి మంచి చేయాలని కోరుకుంటున్నామని అన్నారు, ఆ దుర్గాదేవి ఆశీస్సులు మరెడ్డి కుటుంబ



సభ్యులకు అందరికీ ఉండాలని కోరుకుంటున్నామని అన్నారు, ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తోటకూర శ్రీను, మాజీ సర్పంచ్ సింగినీడి దత్తుడు, వుంద్రు సత్యనారాయణ, పాఠం శెట్టి కాశీరాణి, పాఠం శెట్టి శ్రీనివాసు,ఎంద్రు వీర్రాజు చౌదరి, సాన రాంబాబు, కరెడ్ల వెంకన్న బాబు, పాఠం శెట్టి త్రిమూర్తులు, పాఠం శెట్టి వెంకటేష్, వుంద్రు విష్ణుమూర్తి, సాన వీర వెంకట సత్యనారాయణ, తోటకూర వెంకన్న, సానా సతీష్,మరెడ్డి వీర్రాజు వారి మిత్రబృందం మరియు ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు,

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారితో ఫోన్లో మాట్లాడిన ఎంపీ ఈటెల రాజేందర్

**– గాయపడిన వారితో ఫోన్లో మాట్లాడిన ఎంపీ ఈటల రాజేందర్**
**– హాస్పిటల్ కి బీజేపీ నాయకులను పంపించి అండగా నిలిచిన ఎంపీ ఈటల రాజేందర్**

**కరపత్రర తెలంగాణ రాష్ట్ర బ్యూరో ఫిబ్రవరి 12**



మధ్యప్రదేశ్ ఎన్ హెచ్ 30 పై జబల్పూర్ జిల్లాసిహెూర వద్ద ప్రయాగ్ రాజ్ వెళ్లి వస్తున్న నాచారం చెందిన వారికి రోడ్డు ప్రమాదం జరిగిందని తెలిసిన వెంటనే స్పందించిన ఎంపీ ఈటల రాజేందర్ స్థానిక కలెక్టర్ఎంపీలతోమాట్లాడి పోస్టుమార్టం చేపించారు.ప్రయాగ్ రాజ్ నుండి తిరిగి వస్తున్న మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి.ఆక్సిడెంట్ జరిగిన ప్రాంతానికి దగ్గర ఉన్నారని సమాచారంతో హాస్పిటల్ కి వెళ్లాలని ఈటల రాజేందర్ కోరడంతో హాస్పిటల్ కివెళ్లి చనిపోయినవారి మృతదేహాలనుఅంబులెన్స్ లో హైదరాబాద్ కు తరలించారు.గాయపడిన నవీన్ చారిని ఎంపీఈటల రాజేందర్ తో ఫోన్లో మాట్లాడించిన ఏనుగు. సుదర్శన్ రెడ్డి ప్రమాదం జరిగిన తీరు అడిగి తెలుసుకున్నారు. గాయపడిన మరో వ్యక్తి బాలకృష్ణ కు కూడా ప్రాణాపాయం లేదని తెలు పడంతో.మీరుమృత్యుంజయులు అన్న ఈటల.ఉప్పల్ లోజరిగిన విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో కలిశామని ఫోన్ లో ఈటలను తెలిపిన నవీన్. మెరుగైన చికిత్స కోసం హాస్పిటల్ వారితో మాట్లాడాము ధైర్యంగా ఉండాలని చెప్పిన ఈటల. రాజేందర్ రాష్ట్రం కానీ రాష్ట్రంలో ప్రమాదం జరిగినా గంట గంటకు అధికారులతో మాట్లాడడమే కాకుండా, బీజేపీ నాయకులను స్వయంగా హాస్పిటల్ కి పంపించి మానసిక స్థైర్యం అందించిన ఎంపీ ఈటల రాజేందర్ కి కృతజ్ఞతలు తెలిపారు.

## తీర్థయాత్ర లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను పరామర్శించిన పరమేశ్వర్ రెడ్డి

**– నాచారం చేరుకున్న మృత దేహాలకు నివాళులు అర్పించిన ఎంపీఆర్**

**కరపత్రం దినపత్రిక ప్రతినిధి ఫిబ్రవరి 12**





తీర్థయాత్రకు వెళ్లి తిరిగి వస్తుండగారోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలను ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుమూల పరమేశ్వర్ రెడ్డి పరామర్శించారు.నాచారంలోని పలు కాలనీలకు చెందిన వారి ఇళ్లకు పరమేశ్వర్ రెడ్డి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.బుధవారం నాచారంకు చేరుకున్న సురకంటి మల్లారెడ్డి ,రాంపల్లి రవి కుమార్ బోరంపేట సంతోష్,కల్యూరిరాజు, సోమవరం శశి కాంత్ మృతదేహాలకు పరమేశ్వర్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కృష్ణ రెడ్డినాచారం డివిజన్ అధ్యక్షులు శ్రీకాంత్ గౌడ్ రామ్ రెడ్డి ,అశ్వద్దామా రెడ్డి ,మహేష్ యాదవ్ ,మామిడాల సంతోష్ రెడ్డిగదాక్రాంతి శ్రవణ్ చిల్క నరేష్ ,శ్రీనివాస్ రెడ్డి ,కృష్ణ రెడ్డి ,బోలెంనరేష్ భారతమ్మ ,లీలా తదితరులుపాల్గొన్నారు